## క్లుప్తంగా

### మృతుడి కుటుంబానికి రూ.10 వేల సాయం



శ్రీదేవికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

**రావులపాలెం:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన గుండా లోవరాజు (43) స్థానికంగా ఉన్న ఒక సినిమా హాల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత జూలై 5న గుండెపోటుతో మృతి చెందాడు. అతడికి భార్య శ్రీదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు భర్తను కోల్పోయిన శ్రీదేవి పిల్లలను పోషించుకోవడానికి భర్త పనిచేసిన సినిమా థియేటర్‌లోనే పని చేస్తుంది. పేదరికంతో పిల్లల పోషణకు నానా ఇబ్బందులు పడుతుంది. సాయం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను కోరగా ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించినట్టు సేవా సమితి సభ్యులు మంగళవారం తెలిపారు.

### రక్తదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

**మామిడికుదురు:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బి.దొడ్డవరంలో మంగళవారం ప్రత్యేక రక్తదాన శిబిరం జరిగింది. దొడ్డవరం స్వయం సేవక్ సంఘ్ సభ్యులు 23 మంది రక్తదానం చేశారు. అమలాపురం ఏరియా ఆస్పత్రికి చెందిన ఉద్యోగులు ఇక్కడకు వచ్చి రక్తం సేకరించారు. సర్పంచ్ చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, సంఘ్ అధ్యక్షుడు పాబోలు శ్రీరామఫణి పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

### నిత్యావసరాల అందజేత



నిత్యావసరాలు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

**రాజోలు:** వివేకానంద మనోవికాస మానసిక దివ్యాంగులకు రోటరీ క్లబ్ ప్రతినిధులు మంగళవారం నిత్యావసరాలు అందజేశారు. రొటేరియన్ యెండూరి రమేష్ ఆర్థికసాయంతో నిత్యావసరాలను సమకూర్చారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏడిద కవీంద్ర, కార్యదర్శి లక్ష్మణరావు, దార్ల పెదబాబు, లక్కింశెట్టి చిన్మయుడు, నామన షణ్ముఖ్ పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీహరి జయంతి

**అంబాజీపేట:** సినీ హీరో శ్రీహరి జయంతి వేడుకలను అంబాజీపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న శ్రీహరి విగ్రహానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీహరి అభిమానులు స్వీట్లు పంచారు.

### పలు వార్డులు ఏకగ్రీవం

**ఆత్రేయపురం:** మండలంలోని నార్కెడ్‌మిల్లి గ్రామంలో 6వ వార్డులో పోతిరెడ్డి సురేష్, బొబ్బర్లంక గ్రామంలో 10వ వార్డు చల్లపూడి విజయ రోహిణి ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. అలాగే ర్యాలి ఒకటో వార్డులో పేర్చేర్ల కిషోర్‌వర్మ, తుటారపు బాలసుబ్రహ్మణ్యం పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఈనెల 19న ఎన్నిక నిర్వహిస్తామన్నారు.

### పేకాట శిబిరంపై దాడి

**ఆత్రేయపురం:** మండలంలోని ర్యాలిలో ఎస్సై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో 9 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.22,390 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### డ్రాయింగ్ కిట్ల పంపిణీ

**పి.గన్నవరం:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జి.పెదపూడి, బూరుగులంక పాఠశాలల విద్యార్థులకు పూర్వ విద్యార్థులు దాసిరెడ్డి కోట సత్యం, కోట సత్యనారాయణమూర్తి డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేశారు. పాఠశాలల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని మండలంలో ప్రతి ఇంటా జరుపుకొన్నారు. తమ ఇళ్ల వద్ద జాతీయ పతాకాలను ఎగరవేశారు.

### పాముకాటుకు గురైన సర్పంచ్

**అంబాజీపేట:** వాకలగరువు సర్పంచ్ మద్దింశెట్టి నాగ సత్యచంద్ర సుబ్బారావు (దొరబాబు) సోమవారం రాత్రి తాచుపాము కాటుకు గురయ్యారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురం నుంచి వచ్చిన దొరబాబు తన ఇంటి గేటు తీసుకుని లోపలకు వెళుతున్న దొరబాబును తాచుపాము కరిచిందన్నారు. దాంతో అమలాపురం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉందని బంధువులు తెలిపారు.



కొత్తపేటలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



నగరంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



మలికిపురంలో జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



కొత్తపేటలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న అముడా చైర్మన్ దేవిడ్‌రాజు

# మహనీయుల స్ఫూర్తితో ముందుకు నడవాలి

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు
- జెండాలు ఎగరేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**కొత్తపేట/రావులపాలెం:** ఎందరో త్యాగధనులు పోరాడి స్వాతంత్ర్యాన్ని సాధించారని, ఆ మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు నడవాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం, కొత్తపేట మండలాల్లోని పలు గ్రామాల్లో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని ఆయన జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్లు వీళ్లని వీళ్లు పరిపాలించుకోలేక మళ్లీ మనకే అధికారం అప్పచెబుతారని భావించారన్నారు. కానీ మన సమరయోధులు, రాజ్యాంగ కర్తల కృషితో మన దేశం ముందడుగు వేస్తూ ప్రపంచం మొత్తం మనదైన సత్తా చాటుతున్నామని, అన్ని దేశాలు మనవైపే చూసేలా చేసుకోగలిగామని అన్నారు. అనంతరం పలు స్కూళ్లలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు సర్టిఫికెట్లు, నగదు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో జగ్గిరెడ్డి వెంట నాయకులు, అధికారులు పాల్గొన్నారు. నియోజకవర్గ కేంద్రమైన కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు, స్వాతంత్ర్య సమరయోధుల స్తూపానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయజెండా ఎగురవేశారు. అలాగే స్థానిక కాంతిభారతి విద్యాసంస్థల ప్రాంగణంలో కరస్పాండెంట్ టి.సత్యవాణి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే పలు కార్యాలయాల వద్ద పలువురు నాయకులు, అధికారులు మువ్వన్నెల జెండా ఎగురవేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పలువురు బాలలు భారతమాత, జాతీయ నాయకుల వేషధారణలో విశేషంగా అలరించారు. వారిని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అభినందించారు.

**మహనీయుల అడుగుజాడల్లో పయనించాలి**

**పి.గన్నవరం/మామిడికుదురు:** మహనీయుల అడుగుజాడల్లో అందరూ పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పీఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నాగుల్లంకలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్తూపం వద్ద మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా జాతీయ పతాకాన్ని ఎగురవేసి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అలాగే నగరం జెడ్పీ స్కూల్ వద్ద ఎమ్మెల్యే చిట్టిబాబు త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి మిఠాయిలు, స్వీట్లు పంచారు. స్వాతంత్ర్యోద్యమ కోసం మహనీయులు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా చిట్టిబాబు గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

**సమైక్యతాభావం కలిగి ఉండాలి**

**మలికిపురం:** ప్రతి ఒక్కరూ సమైక్యతాభావం కలిగి ఉండాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య వేడుకలు గ్రామాల్లో అంబరాన్నంటాయి. మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద జాతీయ జెండాను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం నాటి నేతల సమష్టి పోరాట ఫలితమే ఈ నాడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య ఫలాలని పేర్కొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి జెండా ఎగురవేశారు.



ముక్తేశ్వరంలో వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్న విద్యార్థులు



రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో జాతీయ జెండా ఎగురవేసిన జడ్జి ప్రమీలారాణి



సఖినేటిపల్లి ఎంపీపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య వేడుకల్లో ఎంపీపీ మల్లిబాబు, విద్యార్థులు

**ఆలమూరులో..**

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలమూరు ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ ఆధ్వర్యాన నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు తదితరులు జెండా ఎగురవేశారు.

**సఖినేటిపల్లిలో..**

**సఖినేటిపల్లి:** మండలంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో జీ.భీమారావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ వీరా మల్లిబాబు జాతీయ జెండా ఎగురవేశారు. పలు స్కూళ్లు, పీహెచ్‌సీలు, వివిధ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేశారు. అంతర్వేది ఆలయం వద్ద ఏసీ వి.సత్యనారాయణ జెండా ఎగురవేశారు.

**అయినవిల్లిలో..**

**అయినవిల్లి:** మండలంలోని పలు కార్యాలయాలు, పాఠశాలల వద్ద స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ ఆధ్వర్యాన జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి తదితరులు జెండా ఎగురవేశారు. అలాగే ముక్తేశ్వరం కోనసీమ విద్యాశ్రమ్ పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు జరిపారు. విద్యార్థులు దేశనాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు.

**అంబాజీపేటలో..**

**అంబాజీపేట:** మండలంలోని మండల పరిషత్ కార్యాలయం, హైస్కూల్, పీహెచ్‌సీల వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీల వద్ద చైర్‌పర్సన్‌లు, పలు కార్యాలయాల వద్ద ఆయా అధికారులు, నాయకులు జాతీయ జెండాను ఎగురవేశారు. అరిగెల బలరామమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన వారికి బహుమతులు అందజేశారు.

**రాజోలులో..**

**రాజోలు:** గ్రామగ్రామాల్లో జాతీయ జెండా రెపరెపలాడింది. రాజోలు కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాజోలు శాఖా గ్రంథాలయం వద్ద సర్పంచ్ రేవు జ్యోతి జెండా ఎగురవేశారు. సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజోలు సమీకృత బాలిక, బాలుర వసతి గృహాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏఎస్‌డబ్ల్యూఓ కేవీవీ సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

**ఆత్రేయపురంలో..**

**ఆత్రేయపురం:** స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీడీవో నాతి బుజ్జి అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎంపీపీ కుండ అన్నపూర్ణ జాతీయ జెండా వందనం నిర్వహించారు. ర్యాలి పంచాయతీ వద్ద జెడ్పీటీసీ బోణం సాయిబాబు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ జెండా వందనం నిర్వహించారు. మండలంలోని పలు కార్యాలయాల వద్ద జెండా వందనం నిర్వహించారు. ఆత్రేయపురం మహాత్మాగాంధీ కళాశాలలో పనిచేసిన పోడూరి సత్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం కుమారుడు పోడూరి నారాయణరావు పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

## అవార్డు గ్రహీతలకు సత్కారం



ఆలమూరులో పోలీసు, హైవే సిబ్బందిని సత్కరిస్తున్న ప్రభాకరరావు తదితరులు

**ఆలమూరు:** జొన్నాడలోని 216ఏ జాతీయ రహదారిలోని గౌతమి గోదావరి వంతెనపై వేలాడుతున్న చిన్నారిని సాహసోపేత నిర్ణయం తీసుకుని ప్రాణాపాయ స్థితిలో ఉన్న చిన్నారిని రక్షించి అవార్డులు తీసుకున్న నేషనల్ హైవే, పోలీస్ సిబ్బందికి మంగళవారం ఘన సత్కారం జరిగింది. ఆలమూరులో రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి, పిఠాపురం నియోజకవర్గ పరిశీలకులు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నేతలు ఈ సత్కారాన్ని ఏర్పాటు చేశారు. ఆలమూరు హైవే పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ ఎస్‌వీవీ సత్యనారాయణ, హోంగార్డు వెన్నెటి సాయి కుమార్, హైవే సిబ్బంది జి.సురేష్‌కుమార్, అంబటి రాజు, సకిలే సుబ్రహ్మణ్యం, మానుపాటి నాగరాజు తదితరులకు దుశ్శాలువా కప్పి పూలమాల వేసి మెమెంటోతో సత్కరించారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, ఎంపీటీసీ ఉన్నమట్ల విజయకుమారి, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, చల్లా నానాజీ, మేకా అబ్బు, కొపనాతి శ్రీనివాసు, వెత్సా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## నీతివంతమైన పాలన అందిస్తున్నాం



మగటపల్లిలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును సత్కరిస్తున్న స్థానికులు

**మామిడికుదురు:** అవినీతికి తావులేని నీతివంతమైన పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం మగటపల్లిలో జరిగింది. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేశారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మేలు చేసే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, జిల్లా యూత్ అధ్యక్షుడు సూరిశెట్టి బాబి, పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య, పార్టీ నేతలు యెరుబండి సూరిబాబు, కంచర్ల శేఖర్, గెద్దాడ సత్యనారాయణ, ముప్పర్తి త్రిమూర్తులు, కూనపరెడ్డి రాంబాబు, ఎండీవై షరీఫ్, వలవల పెదబాబు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు పురస్కారాలు



ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న సఖినేటిపల్లి తహసీల్దార్ రామకుమారి, సఖినేటిపల్లి డీటీ భాస్కర్, రావులపాలెం ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్, కొత్తపేట ఏఈ నరేష్

**అంబాజీపేట/సఖినేటిపల్లి/రావులపాలెం/కొత్తపేట:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు అధికారులు వారి సేవలకు గుర్తింపుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. జిల్లా కేంద్రం అమలాపురంలో మంత్రి జోగి రమేష్, కలెక్టర్ హిమాన్షుశుక్లా చేతుల మీదుగా వారు పురస్కారాలను అందుకున్నారు. కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, సఖినేటిపల్లి తహసీల్దార్ వై.రామకుమారి, రావులపాలెం ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తదితర అధికారులు పురస్కారాలు అందుకున్నారు.

### 60 మద్యం బాటిళ్ల స్వాధీనం

**అంబాజీపేట:** మాచవరం డైలీ మార్కెట్ వెనుక ఉన్న బెల్ట్‌షాపుల వద్ద అక్రమంగా విక్రయిస్తున్న 60 మద్యం బాటిళ్లను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. ముక్తాని రాజేష్ వద్ద నుంచి 25 బీరు బాటిళ్లు, వంకా సురేంద్రబాబు వద్ద నుంచి 26 బీరు బాటిళ్లు, 9 క్వాటర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

## ఏపీఎన్జీవో మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఏపీఎన్జీవో రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, తదితరులు

**రావులపాలెం:** ఏపీఎన్జీవో 21వ రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. మండలంలోని గోపాలపురంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే జగ్గిరెడ్డి చేతుల మీదుగా కొత్తపేట యూనిట్ అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడలో జరగబోయే 21వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని అసోసియేషన్ సభ్యులు కోరారు.

## బాధ్యతలు స్వీకరించిన సీఐ

**రాజోలు:** స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ)గా గోవిందరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు, పోలీస్ సిబ్బంది సీఐ గోవిందరాజును కలసి అభినందనలు తెలిపారు. రాజోలు సొసైటీ అధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, శివకోడు సర్పంచ్ నక్కా రామారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ తదితరులు సీఐకు అభినందనలు తెలిపారు.

## అమరవీరుల స్మారక ఫలకం ఆవిష్కరణ



కేశవదాసుపాలెంలో అమరవీరుల స్మారక ఫలకం ఆవిష్కరించిన సర్పంచ్ సరోజ

**సఖినేటిపల్లి:** మండలంలోని కేశవదాసుపాలెంలో ఉండపల్లి వారి మెరకలో ఆజాదీ కా అమృత్ సరోవర్‌లో అభివృద్ధి చేసిన మంచినీటి చెరువు వద్ద మంగళవారం సర్పంచ్ మేడిది సరోజ, అమరవీరుల స్మారక ఫలకాన్ని ఆవిష్కరించారు. నాభూమి, నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాన్ని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన పిలుపు మేరకు మాతృభూమి కోసం జీవించడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం అర్పించే నిజ నివాళి అని, పుడమితల్లిని కాపాడుదాం అని పంచ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. వసుధకు వందనం చేస్తూ చెరువు వద్ద మొక్కలను నాటారు. ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, వార్డు సభ్యులు, స్థానికులు, ఎస్‌ఆర్‌జీఎస్ సిబ్బంది, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ఉపాధి పథకం వేతన దారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ



కాట్రేనిపాడులో విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

**రాజోలు:** దాతలు సమకూర్చిన స్పోర్ట్స్ దుస్తులను మంగళవారం కాట్రేనిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కాట్రేనిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీరామమూర్తి జ్ఞాపకార్థం ఆయన మనుమలు సూరిశెట్టి ఆదిత్య, దత్తాకృష్ణలు రూ.16 వేలు, సీఐ బోనం సాయిరమేష్ జ్ఞాపకార్థం ఆయన స్నేహితుడు, హెచ్‌ఎం ఆరేటి త్రిమూర్తులు రూ.6 వేల ఆర్థిక సాయంతో స్పోర్ట్స్ దుస్తులు సమకూర్చారు. సర్పంచ్ అడబాల శ్రీనివాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు అడబాల రాంప్రసాద్, పైడిపర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు.

**రాజోలు:** విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని పాలగుమ్మి సర్పంచ్ అప్పారి లక్ష్మి అన్నారు. మంగళవారం పాఠశాల విద్యార్థులకు దాతలు సమకూర్చిన స్పోర్ట్స్ దుస్తులు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ అప్పారి పైడిశెట్టి–జానకమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఏటా దానిపై వచ్చే వడ్డీ సొమ్ములతో నోట్ పుస్తకాలు, క్రీడాసామగ్రి విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఎంపీటీసీ బత్తుల హేమ, నాయకులు అప్పారి వెంకట సత్యనారాయణమూర్తి, బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

**అంబాజీపేట:** ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి ప్రణాళిక బద్ధంగా చదువుకోవడం వల్ల ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. చిరతపూడిలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను హెచ్‌ఎం బీవీ శేషగిరి అధ్యక్షతన మంగళవారం పంపిణీ చేశారు. పదిలో కట్టా లక్ష్మీ సత్య ప్రియకు (ప్రథమ) రూ.1,500, దిగుమర్తి సుమకు (ద్వితీయ) రూ.1,500, లంక అభిషేక్ (తృతీయ) రూ.500 నగదును సర్పంచ్ దంపతులు అందజేశారు. అలాగే రూ.4 వేలు విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్‌ను గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, పీఎంసీ చైర్మన్ రంప నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఇరుకు రోడ్డులో భారీ వాహనాలు

**ఆలమూరు:** కొత్తూరు నుంచి వెదురుమూడి వెళ్లే రోడ్డులో తరచూ భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల ట్రాఫిక్‌కు విపరీతమైన అంతరాయం ఏర్పడుతుంది. అదే రహదారిలోని పినపళ్లలో పేపర్‌మిల్లు, రైసుమిల్లులు ఉండటంతో పాటు కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాలకు అదే ప్రధాన రహదారిగా ఉంది. రహదారి బెర్మ్‌లు సక్రమంగా లేకపోవడంతో వాహనాలు ఎదురుఎదురుగా వెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఇదే రహదారికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టినా బెర్మ్‌లను పునరుద్ధరించకపోవడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు సత్వరమే స్పందించి రహదారి బెర్మ్‌లు నెలకొల్పాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

### విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

**అంబాజీపేట:** ఎస్సీ వర్గీకరణతో పాటు దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వల్లూరి సత్తిబాబు పిలుపునిచ్చారు. స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఉన్న సామాజిక భవనంలో తొత్తరమూడి హృదయకృష్ణ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ మండల సమావేశం మంగళవారం జరిగింది. విశ్వరూప మహాసభను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కొల్లు సూర్యారావు, ఉందుర్తి నాగబాబు, యార్లగడ్డ సత్తిబాబు, ఈతకోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### వాసవీ క్లబ్ అంతర్వేది ప్రారంభం

**సఖినేటిపల్లి:** అంతర్వేది దేవస్థానంలో టూరిజం గెస్ట్ హౌస్‌లో మంగళవారం భీమవరం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ అంతర్వేది ప్రారంభించారు. 30 మంది సభ్యులతో కూడిన క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా అంతర్జాతీయ క్లబ్ పూర్వాధ్యక్షుడు తిరువీధి వేణుగోపాల్ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన తిరువీధి వరలక్ష్మి, ఇనస్టలేషన్ ఆఫీసర్‌గా కొల్లేపర కృష్ణాజీ వ్యవహరించారు. అంతర్వేది క్లబ్ నూతన చార్టర్ అధ్యక్షుడిగా ఎన్నుకున్న పీవీ నాగేశ్వరరావుకు, ముఖ్యఅతిథి వేణుగోపాల్ కండువా వేసి సత్కరించారు. అలాగే కొత్త కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా అప్పన సతీష్, కోశాధికారిగా అప్పన గంగాధరంలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం అనంతరం కార్యవర్గాన్ని ప్రముఖులు శాలువాలుతో సన్మానించారు.